# "పావులు పాములుగా మారిన వేళ"

దిక్కులేని శవాన్ని దహనం చేయడానికి ఓ పుడక దానం చేయమంటె చేతులు వెనక్కి పెట్టుకొనే గ్రామ నాయకులు ఉన్నట్టుండి ఉదారులై పోయారు.

'ఒరేయ్ అప్పిగా! నర్సిగా! లచ్చీ' అని పిలిచేనోళ్లు 'ఏమోయ్ అప్పారావు! నర్సయ్యా! లచ్చిందేవి' అని పిలుస్తున్నాయి.

కాస్తనోట్లో నాలికున్నవాడికి మందుకి, విందుకి లోటులేని రోజులవి.

అది పంచాయితీ ఎన్నికల సీజను.

ఆ సీజనులో అన్ని ఊళ్ళలాగే రెడ్డిపాలెం కూడా రెండుగా చీలిపోయి, శక్తికొద్దీ రగుల్కొంటోంది.

ఎన్నికలింక రెండే రోజులున్నాయి. ఆ రోజు దాటితే యింక ప్రచారం చేయడానికి వీల్లేదు. అది ప్రచారానికి ఆఖరురోజు కావడంతో మంచి రద్దీగా వుంది.

రాత్రి తొమ్మిదిగంటలౌతుంది. నర్సయ్య యింటిముందు, గుడి వీధిలోవున్న సూరన్న యింటిముందు చాలా హడావిడిగా వుంది.

నర్సయ్యకి సూరన్నకికూడ పెద్దపెద్ద చేరీలున్నాయి. ఊళ్ళోని కూలీజనం మాలపల్లిలోని జనం చాలావరకు ఆ రెండు చేరీలమీదే బతుకుతారు. నర్సయ్య ప్రస్తుతం రెడ్డిపాలెం ప్రెసిడెంటు. దాదాపు ప్రెసిడెంటు పదవి – పుట్టినప్పటి నుంచి నర్సయ్య వంశంలోనే పెరిగింది. అందుకే నర్సయ్యకి, నర్సయ్య పార్టీవాళ్ళకి గెలుపు తమదేనని గట్టి నమ్మకం. అయినా పోటీ చేస్తున్న సూరన్నకూడా తక్కువవాడుగాదు కాబట్టి ప్రచారం మాంచి పకడ్‌బందీగా జరుగుతోంది. రెండువైపుల నాయకులు అడగని వాళ్ళది పాపంగా వరాలిస్తున్నారు. యిదివరలో అలవాటు లేకపోయినా చిరునవ్వుతో పలుకరిస్తున్నారు. రకరకాల ఎన్నికల పాటలు పాడేవాళ్ళని పట్నం నుంచి రప్పించి, పెద్ద వూరేగింపుగా రెండు పార్టీలవాళ్ళు వార్డు వార్డుకీ తిరుగుతున్నారు. పనిలేని పోరంబోకులకి చేతినిండా పనిదొరికింది. ఏ పార్టీకి చెందక మధ్యరకంగా వున్న మనుషులకి విసుగుపుడుతోంది.

నర్సయ్య యింటిముందు ప్రచారానికి బయలుదేరబోయే జనం కూర్చున్నారు.

కూలీజనం, మాలలు వీధిలో కింద నేలమీద కూర్చున్నారు. మునసబు యితర పెద్దలు అరుగులమీద కూర్చున్నారు.

శెట్టిబలిజపేట సూరన్నవైపు తిరిగిపోయిందని తెలిసి, వాళ్ళ పెద్దని కబురంపి లోపల మాట్లాడుతున్నాడు నర్సయ్య.

"ఏవండా మునసబుగోరా! మేమింక బయదెల్తాం మరి. అందరూ తొంగునే యాలైపోతంది. పెసిడెంటు గోర్ని పిలండా" అన్నాడు పెద్దమాల వీరడు.

"వత్తాడుంద్రా! ఎల్లుండి ఎలక్సనైతే నిద్దరెవడోత్తాడ్రా! లోన పేటోళ్ళతో మాటాడతన్నాడు" అని వీరడికి చెప్పి "నరసయ్య మావా! ఈళ్ళనేదో పచారానికి పంపేసి సూసుకోకూడదూ ఆ పనేంటో" అని లోపలికి వినిపించేలా పిలిచాడు.

"వచ్చేత్తన్నా వచ్చేత్తన్నా" అని బదులు పలికి, చివరి మాటగా పేటలో మెంబరుతో "నామాట యింటె బాగుపడతావు. జనానిదే వుంది లెగరా! సూరన్న గుడి కట్టిత్తాడే అనుకో. రేపటికి తయారైపోద్దేటి? ఆ తరువాత కట్టిత్తాడే కట్టించడో ఎవడికి తెల్సు అయినా గుడి కడితే నీ కొరిగేదే టెహ, నీకో వెయ్యి రూపాయలు ముట్టసెబుతాను. కావాలంటే యిప్పుడే అట్టుకుపో. ఎట్టాగూ ఆ వార్డులో నువ్వేనెగ్గుతావు. పోలింగు సరిగ్గా అయిపోయేయాలకి మనోళ్ళ కారులో వత్తారు బూతుకాడకి. అంతే కారులో ఎక్కేసి కూకో. తరువాత సంగతి చూసుకోవచ్చు. నేవున్నా నీకెందుకూ? ఈ ఎయ్యి అట్టుకుపో, యింకిటేపురాకు" అని ఓ వంద పదులకట్ట ఆపేట మెంబరు జేబులో కుక్కి బయటకొచ్చాడు నర్సయ్య.

"ఏవంటాడేటి అడు?" మునసబు అడిగాడు.

"దార్లో పడ్డాడులే. యీళ్ళనింక ఎల్లమందాం."

"తవరికోసవే కూకున్నావయ్యా. కుర్రోళ్ళు కాతంత సుక్కుంటె సలాకిగా వుంటాదంటన్నారు. మరి తవరాసంగతీ." ... అని నసిగాడు వీరడు.

"దానిదేవుంద్రా! ఒరేయ్ ఎంకట్రావ్" అని తన మేనళ్ళుడ్ని పిలిచి, "యీళ్ళకి యెంత కావాలో అంతా పొయ్యమని సెప్పు మన కొండడుతోటి, ఎల్లండ్రా! మన కొండడుబట్టీ కాడకెళ్ళి బేగావచ్చేసి వూరుమీద కెళ్ళండి. సూరన్న పార్టీవోళ్ళ వూరేగింపూ లెగుత్తాదింక. ఎల్లండెల్లండి" అని చెప్పి వాళ్ళను సాగనంపాడు నర్సయ్య.

సూరన్న యింటిముందు కూడా జనం బాగానే వున్నారు. కరణంగారు, సూరన్న బావమరిది శేషగిరి, పట్నంలో ప్లీడరుగావున్న సూరన్న కొడుకు సీతాపతి సూరన్న హాల్లో కూర్చుని మునసబుని నరసయ్యవైపు నుంచి తమవైపుకి తిప్పుకోవడం ఎలాగా అని ఆలోచిస్తున్నారు. ఏమీ మార్గం తట్టడంలేదు.

శేషగిరి వూహ తెలిసినప్పటనుంచి తెల్లటి గాస్కో పంచి సిలుకులాల్చీ తప్ప మరొకటి కట్టి ఎరగడు. ఆ ప్రాంతంలో మంచి రసికుడని పేరు తెచ్చుకున్నాడు. పెద్దవాళ్ళతో పరిచయాలు పెంచుకున్నాడు.

సీతాపతికి పెద్దగా ప్రాక్టీసైతే లేదుగాని, లంచాలిచ్చి పనులు చేయించిపెట్టే అడ్డదారులకి అలవాటుపడ్డ మనిషి.

కరణం బుర్రలుతీసి బుర్రలు పెట్టగలడని పేరున్నవాడు.

అటాంటి ఆ నలుగురూ తీవ్రంగా ఆలోచిస్తున్నారు మునసబు గురించి.

"అయితే మునసబు దేనికీ లొంగడంటారా?" అన్నాడు శేషగిరి కరణంగారితో.

"దేనికి అంటే ......... అతనికి డబ్బు లోటులేదు. మాటతప్పే రకంకాదు. పైగా నర్సయ్యతో ఏదో దూరపు బంధుత్వం కూడా వుందనుకుంటాను. పోనీ మునసబు ఏం చేస్తాడులే వదిలేద్దామా అంటే, యిప్పుడు మెంబర్లుగా పోటీచేసి నెగ్గడానికి అవకాశం వున్నవాళ్ళలో సగానికి పైగా అతని మాటంటె నిలబడతారు. అతనికి వేరే ఏ వ్యసనమూ లేదాయె ఆ పట్నంలోవున్న నాటకాల మనిషి సంపంగితో తప్ప."

"సంపంగంటే చింతామణి వేషం కట్టేదేనా" అన్నాడు శేషగిరి అత్రంగా పని జరిగిపోయినట్టే అన్న ధోరణిలో.

"అదే అదే?"

"యింక మీరా విషయం నాకొదిలెయ్యండి. మునసబుని మనవైపుకి తిప్పకపోయినా, గుమ్మందాటి కదలనివ్వకుండా చేసే ఏర్పాటు నేను చేస్తాను. సంపంగి మన చేతిలో పెట్టేనండీ"

"మరింకేం నీకు తెలియకుండా వుండదని నేనూ అనుకున్నాను" అన్నారు కరణంగారు.

ఆ నలుగురి ముఖాలు విచ్చాయి.

"అయితే నువ్వెళ్ళి ఆపని చూసుకుని బేగా వచ్చేయ్" అని సూరన్న శేషగిరిని పంపించాడు.

"మనవాడు రంగధురీణుడే!" అన్నారు కరణంగారు సూరన్నతో.

"మరేవనుకున్నారు అట్టాంటోళ్ళు మావోడి చేతుల్లో వుండబట్టే, మావోడు లేందే పెద్ద పెద్దోళ్ళందరికీ తోసిచావదు" అన్నాడు సూరన్న.

"అది సరే. పోలింగ్ ఆఫీసర్ల సంగతేం చేశావయ్యా సీతాపతి" అనడిగారు కరణంగారు.

"అన్నీ మాట్లాడి ఏర్పాట్లన్నీ చేసే వచ్చాను. వాళ్ళంతా వచ్చి భోజనాలు నర్సయ్య ఇంట్లో చేస్తారు. అతను సిటింగు ప్రెసిడెంటు కాబట్టి. పని మనతరపునే చేస్తారు."

"నీలాంటి కొడుకున్నప్పుడు మీనాన్న ఎం.ఎల్.ఏ.గా నిలబడినా తంటాలేదనుకో?" అని ఛలోక్తులు విసిరాడు కరణంగారు. అంతా నవ్వుకున్నారు.

బయట కూర్చున్న జనం బలాబలాలను బేరీజు వేసుకుంటున్నారు. ఎలా చూసుకున్నా గెలుపు సూరన్నదే ననిపిస్తోంది – సూరన్న ఇంటి ముందున్న సూరన్న జనానికి.

ఇంతలో నల్లమబ్బుల్లోంచి బయటపడిన చంద్రబింబం లాంటి ముఖాలతో సూరన్న, కరణంగారు, సీతాపతి బయటకు వచ్చారు.

సూరన్న తన వుద్దారుడ్ని పిలిచి, "ధాన్యంకొట్టు ఎనకాతల ఆరు చూపులున్నాయి. గొడ్లసావిడికాడకి యీల్లని తీసుకెళ్ళి ఎవరికెంత కావాలంటే అంతాపోయ్. తాగేసి అక్కడే తొంగునేలా కాదునుసుమా." అని పురమాయించి "ఒరేయ్ దావీదూ!

ఈయాల మంచి రంజుగా వుండాలి ఊరేగింపు. ఒరేయ్ డోలక్ మేళం వోళ్ళు! సురకలాంటి పాటలు పాడాలి. మరీయాల తస్సాదియ్య నర్సయ్య జనం వుడుక్కు డుక్కు సావాలి. ఆ పాటవిని ఏది అపాటేటి? పచ్చి గడ్డిపాట..." అని తడుముకుంటున్నాడు సూరన్న.

అంతలో డోలక్ మేళంలో పాటలు పాడేవాడు అందుకున్నాడు.

"పచ్చిగడ్డిపాట సామ్మ
మెక్కి నువ్వు కూకుంటె
ఊరు సెరువు సేపలన్ని
నువ్వొక్కడివే సప్పరిస్తే
వూరుకోవురోయ్
నిన్ను దింపుతాముర్రోయ్
గద్దె దింపుతాముర్రోయ్" అని

"ఆ! అదే! అపాటే. అన్నీదుల్లోనూ అదే పాట. ఎల్లండి – ఎల్లి ఫుల్లుగా తాగి – బయలెల్లండి ఒరేయ్ లైట్లోళ్ళూ! మీరుకూడా పొండి గొడ్లసావిడికాడికి" అని అందర్నీ పలకరించి పంపించాడు సూరన్న.

సూరన్న పార్టీవాళ్ళ వూరేగింపు బయలుదేరింది. అటువైపునుంచి నర్సయ్యమాత్రం తమ తమ పార్టీ పెద్దలతో వాళ్ళవాళ్ళ యిళ్ళదగ్గరే వున్నారు.

ఈ ప్రచారం, ఊరేగింపులు చూడ్డానికి ఊళ్ళోని కొందరు కుర్రకారు వెంటబడి తిరుగుతున్నారు. అందులోనూ సూరన్న పార్టీ ప్రచారంలో వున్న డోలక్ మేళంవాళ్ళు బాగా పాడుతున్నారని వాళ్ళతో చాలమంది కుర్రాళ్ళు తిరుగుతున్నారు. ఆ కుర్రకారులో సూరన్న పెద్దపాలేరు కొడుకు రాజిగాడు కూడా వున్నాడు. రాజిగాడు పక్కూరి హైస్కూల్లో చదువుకుంటున్నాడు.

రెండు వూరేగింపులూ ఎదురుపడ్డాయి.

సూరన్న పార్టీవాళ్ళు వళ్ళూపై తెలియకుండా ఎగురుతూ తూలుతూ అదేపాట. – 'దింపుతాముర్రోయ్ గద్దె దింపుతాముర్రోయ్' అన్నపాటే పాడుతున్నారు.

నరసయ్య పార్టీవాళ్ళకి ఆ పాట వింటుంటే నరసయ్యనే తిడుతున్నా రనిపించింది. వాళ్ళలో ఒకడు "ఒరేయ్! ఆపండ్రా ఆ పాట" అని అరిచాడు.

"పాటాపమంటానికి నువ్వెవడవెహె! కావలిస్తే నువ్వూ పాడుకో."

"పుచ్చె లెగిరిపోతాయ్ అపుతారా లేదా."

"యీతలోళ్లేం గాజులు తొడిగించుకోలేదు –"

అంతే! కేకలు అరుపులు, కత్తులు గాస్లైట్ల వెలుగులో మెరిశాయి. కర్రలు టక టక మన్నాయి. ఒక చావుకేక వూరు నలుమూలలకి వినిపించింది. జనం ఆగిపోయారు బొమ్మల్లా. తేరుకుని ఆ దృశ్యాన్ని చూసికొందరు చెల్లా చెదరైపోయారు.

అటు నరసయ్య పార్టీలో నరసయ్య పాలేరుకీ గట్టి దెబ్బే తగిలింది.

కాని సూరన్న పార్టీలో పెద్దపాలేరు కొడుకు రాజిగాడి తల బద్దలైపోయింది. నేలంతా రక్తంతో తడిసిపోయింది. ముఖంనిండా రక్తం. ఒళ్ళంతా రక్తం. ఆనవాలు కూడా దొరకనంతగా మారిపోయింది రూపం. రక్తపు ముద్దలా నేల కూలిపోయాడు రాజిగాడు.

రాజిగాడ్ని మోసుకుని సూరన్న ఇంటికి వచ్చేసింది ఊరేగింపు నిశ్శబ్దంగా. వాళ్లంతా ఆవేశంతో వూగిపోతున్నారు.

"ఏవైనాసరే కేసెట్టి ఆళ్ళందర్నీ బొక్కలోకి తొయించాలయ్యా" అన్నాడు దావీదుగాడు.

పెద్దపాలేరు, కొడుకు శవానికి తన భుజం మీది తుండు తీసి కప్పి పక్కనే కుప్పలా వాలిపోయాడు.

యింటికి వెళదామనుకుంటోన్న కరణంగారు యిక కాళ్ళాడక బొమ్మలా నిలబడిపోయారు.

సూరన్న "లంజకొడుకులు! అంతపని చేశారూ ఆళ్ళోళ్ళో ఒక్కడు సావలేదర్రా!" అన్నాడు పళ్లుకొరుకుతూ.

'ఆళ్ళకి తగిలే వుంటాయండి. ఆ తొందరలో మేము చూడలేదుగాని నరసయ్యగోరి పాలేరుకీ గట్టి దెబ్బ అడ్డాదండి?' అన్నాడు సుబ్బడు.

'సరేకానీ చెప్తా వీళ్ళ సంగతి' అని అటూ ఇటూ పచారు చేస్తున్నాడు సూరన్న.

ప్లీడరు సీతాపతికి ఏదో తట్టినట్టుంది తండ్రి దగ్గరకెళ్ళాడు. ఏమిటన్నట్టు చూశాడు సూరన్న. కరణంగారిని కూడా వెంట రమ్మన్నట్టు చూశాడు సీతాపతి ముగ్గురూ లోపలికెళ్ళారు.

బయట జనం 'మన సూరన్న గోరబ్బాయి ప్లీడరు ఆయనేదో కట్టుదిట్టం గానే చేత్తాడు. ఆళ్ళని వదుల్తాడేటి? ముక్కు నేలనెట్టి రాసేత్తాడు' అని నిండుపరచుకుంటున్నారు.

రాజగాడి తండ్రి మాత్రం మాటా మంతీ లేకుండా కొడుకు శవం పక్కనే కూలబడి పోయాడు. రాజిగాడి తల్లి అలోపాలో మంటూ గుండెలు బాదుకుంటూ వచ్చి శవం మీద పడి ఏడుస్తోంది.

☆ ☆ ☆

అక్కడ నర్సయ్య 'మనంతట మనం కేసెట్టొద్దు ఆళ్ళు కేసెడితే దామ్మీ అని చెప్పి మనవూ కేసెడదాం. మన పాలేరుకీ బాగానే తగిలాయిగా దెబ్బలు. గట్టి సర్టిఫికేట్ వత్తాది ఏమంటావ్ మునసబు మావా!' అన్నాడు.

సూద్దాం అవతల మడిసి సచ్చాడుగా, ఎట్టావత్తాడో మనకి తొందరెందుకూ? మనకుండే బలం మనకీవుందిగా అని ఎదురుపార్టీ వాళ్ళ ఎత్తునుబట్టి పైయెత్తు కోసం ఆలోచిస్తున్నాడు మునసబు.

'నా అనుమానం ఆళ్ళు కేసెడతారేమోనని! ఎందుకంటె ఆ ప్లీడరు

సీతాపతిగాడికి యిప్పటి దాకా పెద్ద కేసొకటీ లేదుగా, ఈ మర్డరుకేసు తీసుకుని అడూ వాదిద్దామని ముచ్చట పడితే?'

'అదీ నిజమే అనుకో, ఐనా నాచేత బకీరు రాయించాలిగా'

'అడు ప్లీడరుగందా ఏకంగా పోలీసుకే రిపోర్టు రాసి పంపేతాడేమో అసలు మర్డరంటె చాలు. పోలీసులు ఎగేసుకొచ్చేత్తారు'

'కేసెడితే పర్లేదయ్యా పేటలోకి మాలపల్లిలోకి ఎల్లి అళ్ళ జనాన్ని మనింటి మీదికి పంపుతారేమోనని నా అనుమానం. అందకుముందే మన జనాన్ని మనం పోగేసుకుని సిద్ధంగా వుంటం మంచిదనిపిత్తంది నాకు. ముందా పని సూడు' అని సలహా యిచ్చాడు మునసబు నరసయ్యకి.

అంచెలమీద సమాచారం పేటలోకి మాలపల్లిలోకి చేరిపోయింది పేట, మాలపల్లి రెండు ముక్కలైపోయాయి అటు నర్సయ్య యింటికి, యిటు సూరన్న యింటికి చేరిపోయాయి. యజమానుల ఆదేశం కోసం ఊపిరి బిగపట్టుకుని కూర్చున్నారు అటుజనం యిటు జనం కూడా.

సూరన్న కరణం సీతాపతి చాలా సేపటి నుంచి ఏం చేయాలా అని లోపల కిందామీదా పడుతున్నారు సూరన్న పార్టీ తాలూకు మాలలు, శెట్టి బల్జీలు అడమగతో సహా అప్పటికే సూరన్న యింటికి చేరిపోయారు. సూరన్న మాట కోసం ఎదురు చూస్తున్నారు ఏమేనాసరే కేసు పెట్టాలన్న పట్టుదలతో వున్నారు వాళ్ళంతా.

చివరికీ సీతాపతి 'నాకో అలోచన తట్టింది' అన్నాడు.

'ఏమిటది?' అన్నారు కరణంగారు.

'ఈ చావునీ. ఈ శవాన్నీ మనం ఎందుకు తెలివిగా వాడుకోకూడదూ?'

'అదెల్లా?'

'నే చెబుతాగా? – చచ్చినవాడు కుర్రాడు. చదువుకుంటున్న వాడు. వాడు ఎలాగూ చచ్చాడు కాబట్టి, ఎన్నికల ప్రచారంలో చావడాన్ని పురస్కరించుకుని వాడిచావుకో విశిష్టతను అపాదించి, వాడికి జైకొడుతూ వూరేగిస్తే, తటస్థంగా వున్న వూళ్ళో జనం మనవైపుకే మొగ్గే అవకాశాలున్నాయి. నర్సయ్య పార్టీమీద ద్వేషం కలిగి తీరుతుంది. అదే మన గెలుపుకి అధారం కావచ్చు. అలా కాకుండా కేసెడితే వాళ్ళ సైడు పెద్దల్ని మనం కేసులో యిరికిస్తాం. మనసైడు పెద్దల్ని వాళ్ళు కేసులో యిరికిస్తారు అసలు చంపిన వాడిమీద కేసెప్పుడూ రాదు. యిల్లాంటి కేసులో అరెస్టులు జరగొచ్చు యెలక్షన్ ఆగిపోవచ్చు. అందుకు ఊరేగింపే మంచిదని నా ఉద్దేశ్యం. ఏమంటారు?' అన్నాడు సీతాపతి.

'నువ్వు చెప్పిందే రైటు, నిజంగా గొప్ప అలోచనే కాని వీళ్ళని ఒప్పించడం యెలాగా అని' అన్నారు కరణంగారు.

'నే మాట్లాడతాగా, ఏమంటావు నాన్నా?'

'నాకేం పాలుపోటంలేదురా. ఏదిసేత్తే బాగుంటదో నువ్వేసూడు. సమయానికి మీ మామకూడ లేడు వూళ్ళో.'

'నే చెప్పినట్టు చేస్తే దానివల్ల వచ్చేలాభం తరువాత మీకే తెలుస్తుంది. కాని తెల్లవారేసరికి వూరేగింపు, శవదహనం కూడా జరిగిపోవాలి.'

'ముందాళ్ళ నొప్పించుమరి.' అన్నాడు సూరన్న.

'నే చెప్తాగా' అంటూ సీతాపతి బయటకొచ్చాడు సూరన్న, కరణం కూడ వెనకేవచ్చారు.

జనంలో కలకలం తగ్గిపోయి ఒక్కక్షణం పెద్దలమాట కోసం నిశ్శబ్దం ఆవరించింది.

సూరన్న మొదలుపెట్టాడు.

'మా వోడు సీతాపతి మనందరికంటె తెలిసినోడు? సదువుకున్నోడు. పైగా ప్లీడరు. ఇట్టాటి సమయాల్లో అడి మాటలకించటం మనందరికీ మంచిదనిపత్తందినాకు, మా వోడు చెప్పింది యినండి. మన పార్టీలో మడిసిని సంపిన అళ్ళని వదుల్తానని మాత్రం అనుకోకండి అళ్ళని మట్టికరిపించే పూచీ నాది, అబ్బాయి సెబుతాడినండి', అని అగాడు సూరన్న.

సీతాపతి అందుకున్నాడు. 'పోయినవాడు చదువుకుంటున్న కుర్రాడు, వాడు బతికితే యం.యల్.ఏ. అయ్యేవాడో, మంత్రే అయ్యేవాడో, ఏదో ఒకటి తప్పకుండా, అయ్యేవాడే. అందుకే ఆడి శవాన్ని చూశాక అరగంటసేపు నాకు నోట మాట రాలేదు, లేకపోతే పదహారేళ్ళవాడికి యెన్నికల ప్రచారంలో తిరగాలన్న సరదా యెందుకు పుడుతుంది? వాడు పైగా మన పార్టీలో కుర్రాడు, అందుకే వాడిచావును యిలా అల్లాటప్పగా కేసుపెట్టి పాడుచెయ్యటం నాకిష్టం లేదు. యిప్పుడు పోలీసు కేసుపెడితే జరిగేదేమిటి? ఈ శవాన్ని యింకా ముక్కలు ముక్కలుగా కోస్తారుముందు' అన్నాడు సీతాపతి.

ఆ మాట వినేసరికి రాజిగాడి తల్లి బావురుమంది. అంతా వూరుకోబెట్టారు.

మళ్ళీ మొదలుపెట్టాడు సీతాపతి.

'దానివల్ల మనకొరిగేదేమిటి? అలా జరగటం నాకిష్టంలేదు, వీడి చావుకి ఒక ప్రత్యేకతని కల్పించి వాడ్ని వాడి చావుని యెవ్వరూ మరిచిపోకుండా వుండేలా చెయ్యాలి, అలా చెయ్యాలంటే వాడి శవాన్ని మనం వూరంతా వూరేగించాలి. మన పార్టీకోసం వాడు ప్రాణాలు అర్పించాడు కాబట్టి వాడికోసం మనం ఆమాత్రం చెయ్యాలి. ఆ తరువాత మనం యెలాగూ నెగ్గుతాం, నెగ్గాక మనం అధికారంలో వుంటె వాళ్ళని యెలానొక్కాలో అలా నొక్కచ్చు. మీరెవరినేనా తన్నినా తగువు మనచేతులమీద సాగుతుంది. న్యాయం మనం చెప్పినట్టు వింటుంది, మనందరం కలిసి పంచాయతీ ఆఫీసులో వాడి ఫోటో పెట్టించాలి, అప్పుడే వాడి ఆత్మకి శాంతి వుంటుంది, ఏమంటారు?' అన్నాడు సీతాపతి.

సీతాపతి మాటలు అక్కడి జనానికి తియ్యగా వున్నాయి 'సరే' అన్నారంతా.

"సీతాపతిగోరు గొప్ప మడిసి" అన్నాడు దావీదు గాడు.

ఊరేగింపు లేచింది. శవంమీద పూలదండలంత ఎక్కువగా లేవు. పరకాయించి చూస్తే యింకా రక్తపు ముద్ద లాగేవుంది శవం.

జనం నినాదాలిస్తున్నారు.

రాజయ్య ఆత్మకు శాంతికలగాలంటే, సూరన్న పార్టీనే గెలిపించండి.

రాజయ్యని చంపిన నర్సయ్య పార్టీ - డౌన్ డౌన్.

నరసయ్య దురాగతాలు ........ నశించాలి. రాజయ్యకీ - జై.

అన్ని వార్డుల్లోను శవం వూరేగింది. గ్రామంలోని జనం పసివాడి చావుగురించి జాలిపడ్డారు. 'అయ్యోపాపం, వెర్రిపిల్లాడు' అనుకున్నారు ఆడవాళ్ళు.

ఎలక్షన్ జరిగిపోయింది.

సూరన్న పార్టీయే అధికారంలో కొచ్చింది.

సూరన్నే ప్రెసిడెంటుగా నెగ్గాడు.

రెండు పార్టీల మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమంటోంది. యేవో చిన్నచిన్న కొట్లాటలు జరుగుతూనే వున్నాయి. అడపా దడపా తగవులు మాత్రం ఊళ్ళో పరిష్కారం కావడంలేదు. మునసబు తటస్థంగా వుండిపోయాడు శేషగిరి వేయించిన మాత్రతో.

కేసులకి పెట్టుబడి పెట్టి అటు నరసయ్య, యిటు సూరన్న నడుపుతూనే వున్నారు, సితాపతికి ప్రాక్టీసు పెరిగింది.

కరణంగారి కొడుక్కి పంచాయితీ ఆఫీసులో ఉద్యోగం దొరికింది.

ఇంతలో ఎసెంబ్లీ ఎన్నికలొచ్చాయి -

పెద్దపెద్ద నాయకులు దేశం మీద పడ్డారు. నలుమూలలకి తిరుగుతున్నారు. ఓ రాష్ట్రస్థాయి నాయకుడు, ఎం.ఎల్.ఎ.గా నిలబడినతను రెడ్డిపాలెం వచ్చి సూరన్నని కలుసుకున్నాడు. ఊరంతా తనకే ఓటు వేసేలా చూడాలన్నాడు.

సూరన్న 'అలానే మాటివ్వలేను. మా పార్టీ మీకు ఓటేత్తే, నర్సయ్య పార్టీ మీకోట్లెయ్యదు. వాళ్ళేత్తె ఈళ్ళెయ్యరు, అదీ పరిత్తితి' అన్నాడు.

'నాకీ విషయాలు, యిక్కడ జరిగిన గొడవలు శేషగిరి అప్పుడే చెప్పాడయ్యా. అయితే ఇంకా మీరు మారలేదన్నమాట.' అన్నాడు నాయకుడు.

'ఇంకా అల్లాగే రాజుకొంటంది ఊరు' అన్నాడు సూరన్న.

'అబ్బే! యిదేం మంచి పద్ధతి కాదయ్యా, ఎన్నాళ్ళు పెద్దలు మీరిద్దరూ యిలా విడిపోయి వుంటారు? ఏదో లేబరు జనం ఎలక్షన్లలో కొట్టుకుంటారు. అప్పుడు మనం ఖర్చు పెట్టేడబ్బు కోసం అలా వాళ్ళు ఆవేశపడతారు. కొట్టుకుంటారు ఎవరో తలమాసినవాడు ఒకడు చస్తాడు. అంత మాత్రంచేత పెద్ద కుటుంబీకులం, మనం ఎడమొగం పెడమొగం అయితే ఎలా? చివరికి దిబ్బయ్యేది మనవా? వాళ్ళా? అలా కేసులకి పెట్టుబడి పెట్టి కేసులు నడుపుతావుంటె మనమూ వాళ్ళలాగే అయిపోతాం. ఈ మాటే నరసయ్యతోటి చెప్పి మిమ్మల్నిద్దర్నీ రాజీ పెడదామనే వచ్చాను. నా మాట కాదనక నాతోరా! నరసయ్య ఇంటికి వెడదాం' అని సూరన్నని నరసయ్య యింటికి తీసుకెళ్ళాడు నాయకుడు.

నరసయ్య మొదట కాస్త బెట్టుచేసినా చివరికి నాయకుని మాటలు రైటే అనిపించి మెత్తబడ్డాడు.

పైగా నాయకుడు మరో చిట్కా ఉపయోగించాడు.

'ఊళ్ళో ప్రెసిడెంటు పదవి ఒక్కటేనా వున్నది, కావాలనుకొంటే బోల్డు పదవులు, సూరన్న పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు అయితే, నువ్వు కోఆపరేటివ్ సొసైటీ పెట్టించి దాని ప్రెసిడెంటుగా నెగ్గు సూరన్న కూడా నిన్నే సపోర్టు చేస్తాడు. ఆ తరువాత నే మంత్రి అయితే నిన్ను సమితికే నిలబెడతాను. అతన్ని సొసైటీని బ్యాంకుచేసి దాని ప్రెసిడెంటుని చేద్దాం అలా మనలోమనం సర్దుకుపోవాలిగాని, పెద్దాళ్ళం పెద్దాళ్ళం కొట్టుకు చస్తామా?' అని మందలింపుగా ఆశ కలిగేలా మాట్లాడి వాళ్ళిద్దరికి రాజీ పెట్టాడు నాయకుడు.

సూరన్న నరసయ్య కలిసిపోయారని త్వరలోనే వూరంతా పాకిపోయింది. ఎన్నికల సమయంలో యిద్దరూ కలసి బయటకొచ్చి, ఒకే కారులో తిరిగి, తమకి రాజీ కుదిర్చిన నాయకుడికే ఓటు వేయమని జనానికి చెప్పారు.

అంతే.

రెండుగా విడిపోయిన పేట జనానికి, మాలపల్లి జనానికి గుండెలు మండిపోయాయి, వాళ్ళని పెద్దవాళ్లు మోసగించారన్న బాధ గుండెల్లో రగుల్కొంది.

కొట్టుకున్నది వాళ్ళలో వాళ్ళే.

చచ్చిందీ వాళ్ళకుర్రాడే.

దెబ్బలు తిన్నదీ వాళ్ళవాడే.

కాని నెగ్గిందీ గద్దె ఎక్కిందీ పెద్దవాళ్ళు, కలవాళ్ళు.

పదవులు పంచుకునేందుకు ఒప్పందం కుదుర్చుకుని జనాన్ని పట్టించుకోకుండా కలిసిపోయిందీ పెద్దవాళ్ళే.

అప్పటి దాకా రెండుగా చీలిపోయి ఒకళ్ళమీద ఒకళ్ళు కర్రలు కత్తులు దూసుకున్న పేటలోని జనం, మాలపల్లిలోని జనం ఒకళ్ళ ముఖాలు ఒకరు చూచుకున్నారు.

ఏ పెద్దలకోసం వాళ్ళు చీలిపోయారో ఆ పెద్దలే కలిసి ఒకటైపోవడంతో ఒక్కసారి మాలపల్లి, శెట్టిబల్జీపేట నోళ్ళు తెరిచాయి.

వాళ్ళని ఎవరు మోసం చేశారో అమాయకుడైన రాజిగాడి చావుకి ఎవరు కారుకులో తెలుసుకున్నారు వాళ్లు.

ఇన్నాళ్ళూ తమలో తామే ఒకళ్ళమీద కొకళ్ళు ఎత్తుకున్న కర్రలు ఎవళ్ళ మీదకి తిప్పాలో నిర్ణయించుకోవలసినవేళ వచ్చింది.

ఎనభై ఏళ్ళు నిండిన అప్పడు నోళ్ళు తెరిసి గుండెలు పిసుక్కొంటూన్న తనవాళ్ళని చూచి 'మీకేటి తెలుసురా సన్నాసుల్లారా? పెద్దోళ్ళు పెద్దోళ్ళూ ఎప్పుడూ ఒకటేరా. కాలికి కత్తికట్టి కోడిపుంజును కోడిపుంజు మీదకే వదిలినట్టు మనోళ్ళని మనోళ్ళ మీదికే వుసిగొలుపుతార్రా పెద్దోళ్ళు. మనలోమనం కొట్టుకుసత్తే నెగ్గిన పుంజు తరుపు పెద్దోడు తనే గొప్పోడ్నంటాడు, ఓడిన పుంజు తరుపు పెద్దోడు కొత్త పుంజుని ఎతుక్కుంటాడు. అట్టాంటి పెద్దోళ్ళని నమ్ముకుని మీరేడుత్తారు, యిప్పటికేనా నిద్రలెగండ్రా యదవల్లారా' అన్నాడు.

యిన్నాళ్ళు పెద్దవాళ్ళ చేతుల్లో పావుల్లా బతికిన వాళ్లంతా పగపట్టిన పాముల్లా బుసలు కొట్టారావేళ.